www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 7 నవంబర్ 2022
5
వైఎస్ఆర్



ఎంఎల్‌హెచ్‌పిలకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-కడప సిటీ


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఆర్‌డి కోటేశ్వరమ్మ

వైద్య ఆరోగ్య శాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ కోటేశ్వరమ్మ ఆధ్వర్యంలో జోన్-4 ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఉమ్మడి నాలుగు జిల్లాల జోన్-4 పరిధిలో(ఎంఎల్ హెచ్‌పి) మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు ఉద్యోగులకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డి మాట్లాడుతూ 391 పోస్టుల మంజూరువగా రీజనల్ పరిధిలో 292 పోస్టులకు కౌన్సెలింగ్ నిర్వహించామన్నారు. 271 మంది కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. 22 మంది తప్పా మిగతా వారంతా విజయవాడలో రిపోర్ట్ చేయాలన్నారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

- రూ.135 కోట్లతో రోడ్ల పనులకు కసరత్తు
- పాడా నిధులతో బిఎంసి, ఎఎంసిల నిర్మాణం
- కొండాపురం-సిరిగేపల్లి బ్రిడ్జికి ప్రాధాన్యత
- రూ.307 కోట్లతో ఇఏపి పనులు
- పిఆర్ ఎస్ఇ శ్రీనివాసులరెడ్డి

జిల్లాలో మౌలిక కల్పనకు పెద్దపీట వేశాం. సచివాలయ నిర్మాణ పనులు, రైతు భరోసా భవనాలు, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్స్, పాడా నిధులతో పాల సేకరణ కేంద్రాలు, పిఎంజిఎస్‌వై, ఇఎపి, అగ్రికల్చరల్ మార్కెటింగ్ కమిటీ నిధులతో మౌలిక వసతుల కల్పనలో గణనీయమైన పురోగతి సాధించాం. ఈ ఏడాది డిసెంబర్ నుంచి మార్చి నాటికి మౌలిక వసతుల కల్పనను పూర్తి చేయడమే లక్ష్యం. వ్యవసాయ మార్కెట్ కమిటీ నిధులు, పిఎంజిఎస్‌వై, ఇఎపి నిధుల సహాయంతో రహదారుల నిర్మాణాలకు శ్రీకారం చుట్టాం. యుటిలిటీవ్యాలూ మీద ఆధారపడి రహదారులను ఎంపిక చేయడం జరుగుతుంది. జిల్లాలోని వేంపల్లి, సిరిగేపల్లి వంటి పెద్దబ్రిడ్జిల నిర్మాణ పనులను వేగవంతం చేయడానికి కసరత్తు చేస్తున్నాం. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో అంతర్గత మెరుగైన వసతుల కల్పనపై దృష్టి సారించామని పేర్కొంటున్న పంచాయతీరాజ్ సూపరింటెండింగ్ ఇంజనీర్ జి.వి.శ్రీనివాసులరెడ్డితో ప్రజాశక్తి ముఖాముఖి...

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ముఖాముఖి



జిల్లాలో పంచాయతీరాజ్ అభివృద్ధి పనుల వివరాలు తెలపండి?

జిల్లాలో 2019 సంవత్సరం నుంచి రూ.1,212 కోట్లతో 3,389 అభివృద్ధి పనులు చేపట్టాం. 1287 పనులు పూర్తి చేశాం. 830 పనులు పురోగతిలో ఉన్నాయి. 1272 పనులు ఇంకా మొదలుపెట్టాల్సి ఉంది. రూ. 410.3 కోట్లను వ్యయం చేశాం.

జిల్లాలో వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ ప్రోగ్రెస్ ఎలా ఉంది?

రూ.48 కోట్లతో 343 వైఎస్ఆర్ హెల్త్‌క్లినిక్స్ చేపట్టాం. 110 భవన నిర్మాణాలను పూర్తి చేశాం. ఈలెక్కన 32 శాతం మేరకు నిర్మాణ పనులు పూర్తిచేశాం. ఈ ఏడాది డిసెంబర్ నాటికి మిగిలినవి పూర్తి చేసే పనుల్లో నిమగ్నమై ఉన్నాం.

సచివాలయ భవన పురోగతి చెప్పండి?

జిల్లాలో 426 సచివాలయ నిర్మాణ పనులు చేపట్టాం. రూ.158 కోట్లతో 303 భవన నిర్మాణ పనులు పూర్తి చేశాం. 71 శాతం మేర పురోగతి సాధించాం. మిగిలిన 123 సచివాలయ నిర్మాణ పనులను డిసెంబర్ నెలాఖరు నాటికి పూర్తి చేయడంపై దృష్టి కేంద్రీకరించాం.

ఆర్‌బికెల స్థితిగతులేమిటి?

రూ.75 కోట్లతో 417 రైతు భరోసా కేంద్రాల నిర్మాణ పనులు చేపట్టాం. 210 రైతు భరోసా కేంద్రాల నిర్మాణ పనుల్ని పూర్తిచేశాం. ఇప్పటికి 50 శాతం పనులు చేపట్టాం. డిసెంబర్ నాటికి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేవడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నాం.

జిల్లాలో నిర్మితమవుతున్న పాలసేకరణ కేంద్రాలెన్ని?

రూ.4.5 కోట్లతో 123 పాల సేకరణ కేంద్రాల నిర్మాణ పనులు చేపట్టాం. ఐదు భవన నిర్మాణ పనులను పూర్తి చేస్తాం. ఈ ఏడాది డిసెంబర్ నాటికి భవన నిర్మాణ పనులన్నింటినీ పూర్తి చేస్తాం.

వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ నిధుల వినియోగాన్ని వివరించండి?

జిల్లాలోని రూ.30.57 కోట్లతో రహదారి నిర్మాణ పనులకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. మైదుకూరులో రూ.6.19 కోట్లు, కమలాపురంలో రూ.4.23 కోట్లు, ప్రొద్దుటూరులో రూ.4.54 కోట్లు, జమ్మలమడుగులో రూ.5.54 కోట్లు, పులివెందులలో రూ.74 లక్షలు, బద్వేల్‌లో రూ.9.3 కోట్లతో బి.టి రహదారి నిర్మాణ పనులు చేపడతాం. ఇందులో 10 బి.టి రోడ్డు పనులు ప్రారంభించాం.

పిఎంజిఎస్‌వై పురోగతి ఎలా ఉంది?

పిఎంజిఎస్‌వై ఫేజ్-3 కింద రూ.135 కోట్లతో 33 రహదారి నిర్మాణ పనులు చేపట్టాం. బ్యాచ్-1 కేటగిరీ కింద యుటిలిటీ వ్యాల్యూ మీద ఆధారపడిన జిల్లావ్యాప్తంగా రహదారులను ఎంపిక చేయడమైంది. ఈమేరకు ఇప్పటి వరకు చేపట్టిన పనులకు రూ.17 కోట్ల వ్యయంతో కూడిన పనుల్లో పురోగతి నెలకొంది. మిగిలిన పనులు ఆశించిన పురోగతిలో ఉన్నాయి.

ఇఎపి పనుల గురించి మాట్లాడండి?

రూ.307 కోట్ల ఇఎపి నిధులతో 173 పనులు చేపట్టడమైంది. వీటిని 500 జనాభా కలిగిన హ్యాబిటేషన్లను ప్రధాన స్రవంతి రహదారులతో అనుసంధానం చేస్తాం. జిల్లా వ్యాప్తంగా 10 పనులు పూర్తి చేయడమైంది. 84 రహదారుల పనులు ప్రోగ్రెస్‌లో ఉన్నాయి. సుమారు 79 పనులను మొదలుపెట్టాల్సి ఉంది. ఇప్పటికి రూ.14.08 కోట్లను ఖర్చు చేయడమైంది. 2023 మార్చి నాటికి అన్ని పనుల్ని పూర్తిచేస్తాం.

పాడా పనుల గురించి తెలపండి?

పులివెందుల ఏరియా అథారిటీ డెవలప్‌మెంట్ కింద పంచాయతీరాజ్ పరిధిలో రూ.210 కోట్లతో 1470 పనులు చేపడుతున్నాం. 569 సిసిరోడ్లు, కల్వర్టులు తదితర పనులు పూర్తి చేశాం.

సిరిగేపల్లి బ్రిడ్జి ప్రణాళికేమిటి?

కొండాపురం-సిరిగేపల్లి బ్రిడ్జి పనులు తాత్కాలికంగా నిలిపేశాం. గండి కోట జలాశయం బ్యాక్‌వాటర్ కారణంగా పురోగతి లేదు. వెనుక జలాలు తగ్గిన వెంటనే పనులను వేగవంతం చేస్తాం.

వేంపల్లి బ్రిడ్జి నిర్మాణ పనుల గురించి తెలపండి?

వేంపల్లి బ్రిడ్జి నిర్మాణం శ్లాబ్ దశకు చేరుకుంది. ఈ ఏడాది పాపాఘ్ని నదికి వచ్చిన వరదల కారణంగా బ్రిడ్జి శ్లాబ్ మూత పనుల్ని వాయిదా వేయాల్సి వచ్చింది. వరదలు తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో పనులు చేపట్టాలని కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీచేశాం.

సిపిఎస్‌ను రద్దు చేయాల్సిందే

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మిరాజ డిమాండ్

ప్రజాశక్తి - కడప అర్బన్

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాక ముందు ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాల్సిందేనని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మి రాజ డిమాండ్ చేశారు. ఆదివారం యుటిఎఫ్ భవన్‌లో సిపిఎస్ ఉపాధ్యాయుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల అండదండలతో గద్దెనెక్కిన సిఎం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు అవుతున్నా, ఇచ్చిన హామీని అమలు చేయడం లేదన్నారు. సిపిఎస్ రద్దుపై హామీ ఇవ్వని రాష్ట్రాలు సైతం సిపిఎస్ రద్దు చేస్తూ పాత పెన్షన్ వైపు అడుగులు వేస్తుంటే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి మాత్రం హామీ ఇచ్చి కూడా సిపిఎస్ రద్దు చేయకపోవడం దుర్మార్గమన్నారు. జిపిఎస్ విధానాన్ని అమలు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్ ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. లేనిపక్షంలో భవిష్యత్తులో ప్రభుత్వ వైఖరికి నిరసనగా కార్యాచరణ చేపడతామని హెచ్చరించారు. ఉద్యమాల ద్వారా ప్రభుత్వ మెడలు వంచైనా సిపిఎస్ విధానాన్ని రద్దు చేయించుకుంటామని పేర్కొన్నారు. సిపిఎస్ రద్దుపై ప్రభుత్వం స్పందించకపోతే ఈ నెల 10 నుంచి 20 వరకు ప్రతి సిపిఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయుడి ఇంటి వద్దకు వెళ్లి



సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజ

కరపత్రాన్ని అందజేస్తామని, 20 నుంచి 30వ వరకు మినీ పాదయాత్ర కార్యక్రమంలో భాగంగా 10 రన్ నిర్వహిస్తామని, డిసెంబర్ 1 నుంచి 30 వరకు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో సదస్సులు, సమావేశాలు ఏర్పాటు చేసి సిపిఎస్ పై ఉద్యోగ, ఉపాధ్యాయులను చైతన్యవంతం చేస్తామన్నారు. జనవరి తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయులను కూడగట్టి సిపిఎస్‌పై పోరుగర్జన నిర్వహిస్తామని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని, సిపిఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయుల విరమణ అనంతరం జీవితానికి భరోసా కోసం పోరాటంలో ముందు ఉండాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా కోశాధికారి నరసింహారావు, జిల్లా కార్యదర్శులు దావుద్దీన్, ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, నాయకులు కిరణ్ కుమార్, కరిముల్లా, సుదర్శన్, అయ్యవారు రెడ్డి, చెన్నకేశవులు, బాబు, ఈశ్వర రావు, నిజాముద్దీన్, సునీల్ పాల్గొన్నారు.

చెత్త పన్ను రద్దు కోసం దశలవారీ పోరాటాలు


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంఎల్‌సి గేయానంద్

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరపాలక సంస్థ విధిస్తున్న చెత్త పన్ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ దశల వారి పోరాటాలు చేయాలని శాసనమండలి మాజీ సభ్యులు డాక్టర్ గేయానంద్, చెత్త పన్ను పోరాట కమిటీ కన్వీనర్ చంద్రారెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.ఎ. సత్తార్ పిలుపునిచ్చారు. ఆదివారం చెత్త పన్ను పోరాట కమిటీ కార్యాలయంలో అఖిలపక్ష నేతల సమావేశం నిర్వహించారు. సమావేశానికి వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరపాలక సంస్థ సామాన్య ప్రజానీకాన్ని పన్నుల పేరుతో తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. చెత్త పన్నుతో పాటు రకరకాల పన్నులను విధిస్తూ ఆర్థికంగా ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. నగరంలో అధికార పార్టీకి చెందిన కార్పొరేటర్లు అత్యధిక మంది వున్నా చెత్త పన్ను రద్దు చేయించడంలో ఘోరంగా విఫలమయ్యారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చెత్త పన్ను రద్దు చేసేలా ఒత్తిడి తీసుకురావడంలో అధికార పార్టీకి చెందిన కార్పొరేటర్లు ఘోరంగా వైఫల్యం చెందారన్నారు. చెత్త పన్ను రద్దు చేసేవరకు పోరాడాలని సమావేశం తీర్మానించారు. అందులో భాగంగా ఈనెల 16 వరకు నగర కార్పొరేటర్లకు వినతిపత్రాలు, 17న అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. సమావేశంలో సిపిఎం కడప నగర కార్యదర్శి రామమోహన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్, బీఎస్పీ నాయకులు గుర్రప్ప, హేతువాద సంఘం జిల్లా అధ్యక్షుడు సి అర్ వి ప్రసాదరావు, కాంగ్రెస్ నాయకులు అయ్యవారయ్య, బీసీ సెల్ శ్రీనివాసులు, లోక్‌సత్తా పార్టీ నాయకులు దేవర కష్ణ, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మి రాజా పాల్గొన్నారు.

'రాహుల్'కు 40 భాషల్లో ప్రావీణ్యత

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ కేతు విశ్వనాథరెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్


సమావేశంలో మాట్లాడుతున్న కేతు విశ్వనాథరెడ్డి

భారత దేశ సామాజిక, సాంస్కృతిక వారసత్వాన్ని తన రచనల్లో శాస్త్రీయంగా పొందు పరచిన రాహుల్ సాంకృత్యాయన్‌కు 40 భాషల్లో ప్రావీణ్యత ఉందని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ కేతు విశ్వనాథరెడ్డి అన్నారు. ఆదివారం యుటిఎఫ్ భవన్‌లో కేంద్ర సాహిత్య అకాడమీ, సాహితీ స్రవంతి సంయుక్తంగా రాహుల్ సాంకృత్యాయన్ రచనలపై సదస్సు నిర్వ హించారు. సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపా ధ్యక్షులు పిళ్లా కుమారస్వామి అధ్యక్షత వహిం చారు. ఈ సందర్భంగా 'కేతు' మాట్లాడుతూ 140కి పైగా సాహిత్యాలు మనకందించారని పేర్కొన్నారు. జీవితమంతా పర్యటిస్తూ అనుభవాల ద్వారా అనేక నవలలు, కథలు, వ్యాసాలు, ట్రావె లాగ్ వంటివి రాశారని చెప్పారు. బౌద్ధం స్వీకరించి అనేక గ్రంథాలు రాశారని తెలిపారు. భారతీయ మేధావుల్లో ఒకరని కొనియాడారు. సాహితీ స్రవం తి కన్వీనర్ బండి ప్రసాద్ మాట్లాడుతూ 'రాహుల్' రచనలపై సాహిత్య అకాడమీ సహకారంతో ఈ సదస్సు నిర్వ హిస్తున్నామని పేర్కొన్నారు. డాక్టర్ ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్యులు ఇరాన్, రష్యా నుంచి వలస వచ్చారని నిరూపించారన్నారు. మాజీ ఎంఎల్‌సి డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ భారతీయ ముస్లిములు ఇండియనైజ్ అవ్వాలని కోరారని చెప్పారు. దీంతో ఆయన కమ్యూనిస్టు పార్టీ నుంచి బహిష్కరణకు గురయ్యారని పేర్కొ న్నారు. అయితే మళ్లీ కమ్యూనిస్టు పార్టీలో చేరారని తెలిపారు. డాక్టర్ వినోదిని రాహుల్ రాసిన లోక సంచారి నవలను సోదాహరణంగా వివరించారు. కార్యక్రమంలో భాస్కర్, సురేష్ బాబు, వైవీయూ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.ఈశ్వరరెడ్డి, హేతువాది శివారెడ్డి, నాగార్జునరెడ్డి, నిమ్మకాయల శివరాం, అడ్వకేట్ కలీం, రహీం, గణేష్, సిపిఎం సీనియర్ నాయకులు నారాయణ, జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, సిపిఐ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, రామయ్య, పాలగిరి విశ్వప్రసాద్‌రెడ్డి, హేతువాద సంఘం జిల్లా కార్యదర్శి సి.ఆర్.వి.ప్రసాద్, పౌర హక్కుల సంఘం నాయకులు జానకీ, దస్తగిరి, లోక్‌సత్తా నాయకులు దేవర శ్రీకృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమేష్ నాయక్, బండి నవీన్ కుమార్, వినోద్ ప్రాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - బద్వేలు



మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

వై.ఎస్. జగన్ చేపట్టిన ప్రజా సంకల్పయాత్ర ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా అప్పట్లో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయా లని సిఐటియు జిల్లా కార్యదర్శి కె. నాగేంద్రబాబు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ప్రజా సంఘాల సమావేశం సీనియర్ నాయకులు షేక్ ఖాదర్ హుస్సేన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ ప్రమాణ స్వీకారం రోజే ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని అన్ని అభివృద్ధి పనులు రివర్స్ టెండరింగ్ చేస్తామని ప్రకటించి, కొన్నింటిని అమలు చేసి కాల్చుకున్నారని చెప్పారు. రాష్ట్రంలోని మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు 2022 జనవరి నుంచి ఇచ్చిన హెల్త్ అలవెన్సును రికవరీ చేయాలనుకోవడం దారుణ మన్నారు. ప్రజా సంకల్పయాత్ర ప్రారంభించి నేటితో ఐదేళ్లయిందని వైసిపి నాయకులు సంబరాలు చేసుకుంటున్నారని, మరో వైపు ముఖ్యమంత్రి కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కడుపుకోత మిగిల్చారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు, ఆవాజ్ డివిజన్ కార్యదర్శి ఎస్. మస్తాన్, పట్టణ నాయకులు కె. బాబయ్య, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం. చిన్ని, పట్టణ నాయకులు రామకృష్ణ, నాగార్జున, రజక వృత్తి దారుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పి. నాగరాజు, కళాకారుల సంఘం పట్టణ నాయకులు ఐ. వెంకటరామయ్య, వడ్డెర వృత్తిదారుల సంఘం పట్టణ నాయకులు జి. సుబ్బ రాయుడు, చర్మకారుల సంఘం పట్టణ నాయకులు రాజమోహన్, ఐద్వా మహిళా సంఘం పట్టణ నాయకురాలు యు. బాలమ్మ, మున్సిపల్ యూ నియన్ పట్టణ కార్యనిర్వాహక అధ్యక్షుడు డి. హరి, నాయకులు పి. శ్యామ్ ప్రవీణ్ పాల్గొన్నారు.

కబ్జా భూమిని స్వాధీనం చేసుకోవాలి


కబ్జా భూమిని పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

పోరుమామిళ్ల రూరల్ : మండలంలోని రంగసముద్రం గ్రామపొలం సర్వే నంబర్ 108/3లో వంక భూమిని కబాదారులు పెద్ద ఎత్తున ఆక్రమించుకుని ప్లాట్లు వేశారని, ప్రభుత్వం స్పందించి వెంటనే స్వాధీనం చేసుకుని పేదలకు పంచాలని సిపిఎం మండల కార్యదర్శి ఎన్. భైరవప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన కబ్జా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోరుమామిళ్ల - మైదుకూరు ప్రధాన రహదారి ఆనుకుని ఉన్న కమ్మవారిపల్లె దగ్గర సర్వే నంబర్ 108/3లో ఉన్న 1-90 ఎకరాల వంక భూమి ప్రభుత్వ ఆధీనంలో ఉన్నట్లు తెలియజేస్తూ నోటీసు ఏర్పాటు చేశారన్నారు. కొందరు కబ్జాదారులు కమ్మవారిపల్లెకు వెళ్లే దారిలో నిర్మించిన పంట కాలువకు ఏర్పాటు చేసిన బ్రిడ్జిని కూడా ఒకవైపు మూసివేసి, మరో వైపున చదును చేసి కబ్జాదారులు ప్లాట్లు ఏర్పాటు చేసుకున్నారని పేర్కొన్నారు. ఈ వంకను భూకబ్జాదారులు చదును చేసి ప్లాట్లు వేయడం దుర్మార్గమని వాపోయారు. రంగసముద్రం పంచాయతీకి అతి దగ్గరలో ఉన్నటువంటి వంకను ఆక్రమిస్తుంటే తహశీల్దార్ కానీ, పంచాయతీ కార్యదర్శి కానీ ఏమీ తెలియనట్లు ఉండడం విడ్డూరంగా ఉందని వాపోయారు. అక్కడ బోర్డు కేవలం దిష్టిబొమ్మకే పరిమితమైందని తెలిపారు. రెవెన్యూ అధికారులు స్పందించి కబ్జాదారుల అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు గౌసియాబేగం, మండల నాయకులు కె. రవి, ఆవాజ్ మండల ప్రధాన కార్యదర్శి బడే పీరా, సిపిఎం నాయకులు బీబి లూర్దుమేరి, ఓబులయ్య, ఓబులమ్మ పాల్గొన్నారు.

ప్రజలను తాకట్టుపెడుతున్న ప్రభుత్వం

కడప అర్బన్ : సిఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలను బ్యాంకులకు తాకట్టుపెడుతున్నారని టిడిపి అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు విమర్శించారు. ఆదివారం బిసెల్ ఉపాధ్యక్షులు దస్తగిరి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఆదాయ వనరులు పెంచే ప్రణాళికలు లేక ఆర్థిక వ్యవస్థ నిర్వీర్యమైపోయిందని పేర్కొన్నారు. ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు పెడుతున్నారని తెలిపారు. రాజధాని తరలింపు విషయంలో ప్రజల మధ్య వైషమ్యాలు, సచివాలయ వ్యవస్థ ద్వారా స్థానిక అధికారాలను నిర్వీర్యం చేశారని చెప్పారు. బడుగు, బలహీన వర్గాల నిధులు దారి మళ్లించి మోసం చేస్తున్నారని విమర్శించారు. విశాఖలో ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందని పేర్కొన్నారు. సమావేశంలో టిడిపి నగర ఉపాధ్యక్షులు కొండా సుబ్బయ్య, న్యాయవాది శివశంకర్‌రెడ్డి, బిసి సెల్ జిల్లా ఉపాధ్యక్షులు, నగర ఉపాధ్యక్షులు పాల్గొన్నారు.

ప్రధాన కార్యదర్శిగా శివకుమార్

పోరుమామిళ్ల : టిడిపి రాష్ట్ర విభిన్న ప్రతిభా వంతుల ప్రధాన కార్యదర్శిగా పోరుమామిళ్లకు చెందిన చెన్నూరు శివకుమార్‌ను నియమించారు. విజయవాడ మంగళగిరిలోని టిడిపి జాతీయ కార్యాలయంలో ఆయన్ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ తన మీద నమ్మకంతో టిడిపి రాష్ట్ర ప్రతిభావంతుల విభాగం ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక చేసిన చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలియజేశారు.


మౌలిక వసతులు కల్పించాలి : సిపిఎం

బద్వేలు : పట్టణంలోని త్యాగరాజు కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి కె. శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక 18వ వార్డులోని త్యాగరాజు కాలనీలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపాలిటీ రూ. 131 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతోందని రోజూ గొప్పలు చెప్పుకుంటున్న పాలకవర్గం 35 ఏళ్లుగా కాలనీలో నివాసముంటున్న వారికి కనీస వసతి కల్పించకపోవడం శోచనీయమని వాపోయారు. సిమెంట్ రోడ్లు, మురుగు కాలువలు, కల్వర్టులు, వీధి దీపాలు ఏర్పాటు చేసేందుకు నిధులు ఖర్చుపెట్టలేదని పేర్కొన్నారు. కాలనీ నుంచి ముబారక్ నగర్‌కు వెళ్లే రహదారి మురుగునీటితో నిండిపోయిందని, పాదచారులు సైతం నడవలేని స్థితిలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతం పందులకు, దోమలకు ఆవాస కేంద్రంగా మారిందని చెప్పారు. ఫలితంగా ప్రజలు విషజ్వరాలు, అంటు వ్యాధులతో బాధపడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా 17,18 వార్డుల కౌన్సిలర్లు, మున్సిపల్ చైర్ పర్సన్, మున్సిపల్ అధికారులు ఈ ప్రాంతంపై దృష్టి పెట్టి స్థానిక సమస్యలను పరిష్కారం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ సీనియర్ నాయకులు షేక్ ఖాదర్ హుస్సేన్, పట్టణ కమిటీ సభ్యులు షేక్ మస్తాన్, ఐత్రంపేట వెంకటరామయ్య, పార్టీ సభ్యులు డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని పొంగూరు నాగరాజు, కాకర్ల బాబయ్య, గంప సుబ్బరాయుడు, ఊటుకూరు బాలమ్మ,రాజా మోహన్, సిద్ధవటం చెంచయ్య, సిద్ధవటం సావిత్రి పలువురు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

ఆవాజ్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

పోరుమామిళ్ల రూరల్ : ఆవాజ్ జిల్లా 4వ మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షులు పఠాన్‌చాంద్‌బాషా పేర్కొన్నారు. స్థానిక జూనియర్ కళాశాలలో మహాసభలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ముస్లిం మైనార్టీలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. వీరి సమస్యలు పరిష్కారం కొరకు 20 ఏళ్లుగా ఆవాజ్ కమిటీ నిరంతరం కృషి చేస్తోందని చెప్పారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ముస్లిం మైనార్టీలను అభివృద్ధికి దూరం పెట్టిందన్నారు. పైగా ఎన్‌ఆర్‌సి, ఎన్‌పిఆర్, సిఎఎ, హిజాబ్, హలాల్, అని నల్ల చట్టాలు తెచ్చి తగాదాలు పెడుతోందని వాపోయారు. బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాలలో, ముస్లిమలు ఇళ్లపై దాడులు చేయిస్తూ భయభ్రాంతులను గురి చేస్తున్నారు. లౌకిక ప్రజాస్వామ్య దేశంలో అందరూ సమానమేనని చెప్పారు. ఎపి ముఖ్యమంత్రి వై.ఎస్. జనగ్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ముస్లిమ్ మైనార్టీలకు ఎన్నో వాగ్దానాలు చేశారని, ప్రస్తుతం అవి అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహాసభలు ఈనెల 30న కడప నగరంలో ఉన్న యుటిఎఫ్ జిల్లా కార్యాల యంలో నిర్వహిస్తారని చెప్పారు. అనంతరం పోరుమామిళ్ల ఆవాజ్ నూతన కమిటీ 15 మందితో ఎన్నుకున్నారు. ఆవాజ్ మండల అధ్యక్షులుగా షేక్ మౌలాలి, మండల ప్రధాన కార్యదర్శిగా బడే పీరా, సహాయ కార్యదర్శిగా జలీల్, గఫూర్, జాఫర్, మాబుఫీరా, రఫీ, ఉపాధ్యక్షులుగా మాబుపీరా, మున్నీర్‌బాషా, ,మస్తాన్, ఖాదర్‌బాష , కమిటీ సభ్యులుగా నన్నే పీరా గౌసియా బేగం బీబి కోశాధికారి ఖాజావలిని ఎన్నుకున్నారు.

ప్రతిపక్షాలను అణగదొక్కేందుకు కుట్ర


జగన్‌మోహన్‌రాజును సన్మానిస్తున్న స్థానికులు

ఒంటిమిట్ట : రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీలను రాష్ట్ర ప్రభుత్వం అణగ దొక్కేందుకు కుట్ర పన్ను తోందని టిడిపి రా జంపేట నియోజకవర్గ నాయకులు చమర్తి జగన్ మోహన్‌రాజు పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రమైన ఒంటిమిట్ట హరిత హోటల్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న వైసిపి అధికార పార్టీ ప్రతిపక్ష పార్టీల గొంతు నొక్కాలని చూస్తుందని తెలిపారు. అక్రమ అరెస్టులు, దౌర్జన్యాలు చేస్తుందని వాపోయారు. ప్రతిపక్ష పార్టీలు అధికార పార్టీ వైఫల్యాలను ఎత్తి చూపితే అక్రమ అరెస్టులు పాల్పడుతోందన్నారు. తప్పుడు కేసులపై ఒక పక్క న్యాయస్థానం మొటికాయలు వేస్తున్నా అధికార పార్టీకి కనపడలేదా ప్రశ్నించారు. మున్సిపాలిటీ, పంచాయతీ ఎన్నికల్లో ఒక భయాందోళన సృష్టిస్తున్నారన్నారు. సంక్షేమ పథకాల కోసం రాష్ట్ర ప్రభుత్వాన్ని తాకట్టు పెట్టారని ఆంధ్రప్రదేశ్ మొత్తం సర్వనాశనం అయిపో యిందని ఆయన అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మాజీ కళ్ల గీత కార్పొరేషన్ డైరెక్టర్ కొమర వెంకట నరసయ్య, సిద్ధవటం మాజీ జడ్పిటిసి చలమయ్య యాద వ్, మాజీ ఎంపిపి లక్ష్మీనారాయణ, వినోద్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు

ప్రజా సేవలే 'లయన్స్' ప్రస్థానం

కడప అర్బన్ : ప్రజాసేవలే ప్రధానంగా లయన్స్ క్లబ్ ప్రస్థానం సాగుతోందని లయన్స్ ఇంటర్నేషనల్ రీజియన్ ఒన్- చైర్మన్ షేక్ అబ్దుల్లా పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య, రాజంపేట ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని మానస ఇన్ సమావేశ మందిరంలో సంస్థ రీజియన్ గ్లోబల్ యాక్షన్ టీం సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన షేక్ అబ్దుల్లా మాట్లాడుతూ సంస్థ సభ్యులంతా సేవాభావంతో ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. మన తరువాత తరాలకు సైతం స్ఫూర్తిగా నిలవాలన్నారు. వారసులకు ధనం కంటే మంచి నడతనే ఇవ్వడమే మంచిదన్నారు. ముఖ్య అతిథి జిల్లా గవర్నర్ ఎంజెఎఫ్ లయన్ చంద్రప్రకాష్ రావు మాట్లాడుతూ లయన్స్ జిల్లా ఎపి విభాగంలో నంబర్ 1గా నిలిచామని తెలిపారు. కంటి చికిత్సల్లో రాయచోటి, అన్నదానంలో ప్రొద్దుటూరు ముందుండడం గర్వకారణమన్నారు. పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ కె. చిన్నప రెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలకు ప్రత్యేక ప్రాధాన్యతనిచ్చే కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సెక్రటరీ సుబ్రమణ్యం, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్షులు డాక్టర్ ఆర్. రంగనాథ రెడ్డి, రాజంపేట అధ్యక్షులు సుబ్రమణ్యం రాజు, టి. లక్ష్మీనారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి వి. గౌరి శంకర్, పద్మప్రియ చంద్రా రెడ్డి, ఓంశాంతి పవన్, బి. కొండా రెడ్డి, కల్లూరు బాల యల్లారెడ్డి, శివశంకర్ రెడ్డి, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటి ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన రాజు, గొబ్బూరి కోటేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న షేక్. అబ్దుల్లా

లైఫ్ సర్టిఫికెట్ల స్వీకరణలో ఎస్‌బిఐ విఫలం

ప్రజాశక్తి - కడప అర్బన్

మాజీ సైనికుల లైఫ్ సర్టిఫికెట్లు స్వీకరించడంలో ఎస్‌బిఐ విఫలమైందని ఉమ్మడి జిల్లా మాజీ సైనిక సంఘం జిల్లా అధ్యక్షులు పి.లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మాజీ సైనికుల లైఫ్ సర్టిఫికెట్లు స్పర్శ పెన్షన్ విధానంలో విలీనమైందని తెలిపారు. సైనిక పెన్షన్ల లైఫ్ సర్టిఫికెట్లు నెట్, సైట్, సాఫ్ట్‌వేర్ ప్రోగ్రాం సరిలేదని, పెన్షన్ స్పర్శలోకి మారిందని, తమకు సంబంధం లేదంటూ రకరకాల కారణాలు చూపుతూ ఎస్‌బిఐ వారు తిరస్కరించడంతో మాజీ సైనికులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. బయట నెట్ సెంటర్‌లో పనిచేసే సైట్ ఎస్‌బిఐలో పని చేయడం లేదని చెప్పడం విచారకరమని తెలిపారు. పెన్షన్ రుణం మంజూరులో వివక్ష చూపుతున్నారని పేర్కొన్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని తెలిపారు.

ప్రజా సంకల్ప యాత్రకు ఐదేళ్లు

ప్రజాశక్తి - కడప అర్బన్


డిప్యూటీ సిఎంకు కేక్ తినిపిస్తున్న తోటకృష్ణ

ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప పాదయాత్ర ప్రారంభించి ఐదేళ్లు పూర్తి చేసుకుందని డిప్యూటీ సిఎం అంజాద్‌బాష పేర్కొన్నారు. ఆదివారం హెడ్ పోస్టాఫీస్ వద్ద ఉన్న వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కటింగ్, అన్నదాన చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, రాష్ట్ర చైర్మన్లు యానాదయ్య, కరీముల్లా, పులి సునీల్‌కుమార్, సీనియర్ నాయకులు మాసీమా బాబు, అఫ్జల్‌ఖాన్, సుబ్బారెడ్డి, డాక్టర్ సొహెల్ అహమ్మద్, బంగారు నాగయ్య యాదవ్, తోట కృష్ణ, ఆదిత్యపత్తి రాజేశ్వరి, టి.పి.సుబ్బమ్మ, కృష్ణవేణి, రత్నకుమారి, మూలే సరస్వతి, రాష్ట్ర డైరెక్టర్లు, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి - కడప అర్బన్



చెత్తను తొలగిస్తున్న యువత

ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని నెహ్రూ యువ కేంద్ర అధికారి మణికంఠ అన్నారు. ఆదివారం స్వచ్ఛ భారత్ స్ఫూర్తితో నెహ్రూ యువకేంద్ర సిబ్బంది, యువ వాలంటీర్లు, సాంఘీక సంక్షేమశాఖ విద్యార్థులు యూత్ హాస్టల్ పరిసరాలలో పిచ్చిమొక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలు శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా స్వచ్ఛ భారత్ ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తుందని పేర్కొన్నారు. మహాత్మా గాంధీ స్ఫూర్తితో ప్రధాని మోడీ ప్రవేశపెట్టిన కార్యక్రమం సత్ఫలితాలను అందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది ప్రేమానందం, యువత పాల్గొన్నారు.

ఆలయం చుట్టూ అభివృద్ధి పనులు

ప్రజాశక్తి - చక్రాయపేట

నాగలగుట్టపల్లి, సురభి, కుప్పగుట్టపల్లె నుంచి వరకుంటపల్లె వెళ్లే మార్గంలో ఉన్న గవిమల్లేశ్వరస్వామి ఆలయం చుట్టూ అభివృద్ధి పనులు చేపట్టారు. ఇందుకుగానూ పాడా నిధులు రూ.21.7 లక్షల వెచ్చిస్తున్నారు. ఆలయం చుట్టూ 2.5 కిలోమీటర్ల మేర రోడ్లను నిర్మించనున్నారు. ఆ మేరకు కాంట్రాక్టర్ మధుసూధన్‌రెడ్డి మాట్లాడుతూ ఆ ఆలయం కొండ ప్రాంతం చుట్టూ దాదాపు 320 ఎకరాలు మామిడి తోటలు ఉన్నాయన్నారు. వీటి రవాణాకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వేంపల్లె పిఆర్ డిఇ రవిచంద్రారెడ్డి, వర్క్ఇన్‌స్పెక్టర్ ఖాదర్‌బాషా పర్యవేక్షిస్తున్నారు. ఆలయం పూజారి పెనవాడి సుధాకర్, రైతులు మల్లికార్జున, చలపతి, చంద్ర హర్షం వ్యక్తం చేస్తున్నారు.


ఆలయం చుట్టూ చేపట్టిన అభివృద్ధి పనులు

వీధిలైట్లకు మరమ్మతులు


ప్రజాశక్తి - ముద్దనూరు

ముద్దనూరు మేజర్ గ్రామ పంచాయతీలో వీధిలైట్ల మరమ్మతులు చేపట్టినట్లు పంచాయతీ కార్యదర్శి గురుమోహన్ తెలిపారు. గ్రామ పంచాయతీలో వీధి లైట్ల నిర్వహణలో భాగంగా శనివారం సర్పంచు కుమారుడు ప్రశాంత్ ఆధ్వర్యంలో మరమ్మతులు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ప్రజలకు అవసరమైన వసతులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఫిట్టర్ శంషీర్‌బాషా పాల్గొన్నారు.

అనాథాశ్రమానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండల పరిధిలోని తిప్పలూరులో ఉన్న ఎద్దుల పెద్ద శేషమ్మ అనాథాశ్రమానికి కడప విద్యుత్ ఉద్యోగుల సామాజిక సేవా సంఘం ఆధ్వర్యంలో రూ.40వేలు ఆర్థికసాయాన్ని అందించినట్లు ఆశ్రమ నిర్వాహకుడు నాగేంద్ర తెలిపారు. కడప ఎస్ఇ వ ు ని శ ం క ర య్య, ప్రొద్దుటూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసులరెడ్డి, విద్యుత్ సామాజిక సేవా సంఘం అధ్యక్షులు, కడప కన్‌స్ట్రక్షన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగరాజు చెక్కు రూపంలో నాగేంద్రకు అందజేశారు. ఈ మొత్తాన్ని ఆశ్రమంలో రేకులషెడ్ నిర్మాణానికి ఉపయోగిస్తునట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా నాగేంద్ర వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంవి చలపతి, ఎం రఘు, ఎర్రగుంట్ల డిఇ నరసింహారెడ్డి, ఎఇ సుబ్బారావు, గంగాధర్, మురళీకృష్ణ పాల్గొన్నారు.


చెక్కును నాగేంద్రకు అందజేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : స్థానిక ప్రకాష్ నగర్‌కు చెందిన పేద వధువు నూర్జహా, అనారోగ్యంతో బాధపడుతున్న అమృత నగర్‌కు చెందిన ఖాదర్‌కు ఆదివారం మన ప్రజాసేవా సమితి కార్యాలయంలో ముక్తియార్, ఇవి సుధాకర్‌రెడ్డి రూ.10 వేలు ఆర్థిక సాయం అంద జేశారు. ఈ సందర్భంగా మన ప్రజాసేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఎండి అయూబ్ ఖాన్ మాట్లాడుతూ పేదలను ఆదుకోవడంలో ముందుంటామన్నారు. ఈనెల 23న ఉదయం 9 గంటలకు నారాయణ హాస్పిటల్ వారిచే మెడికల్ క్యాంపు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్న స్టార్ ఫౌండేషన్ సిరాజుద్దీన్, సంఘ సేవ యూట్యూబ్ ఛానల్ సపోర్ట్ చేసిన అజీజ్, ఐమన్ అలీని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఖలీల్, దాదాపీర్, జెడి జమల్ దిన్, మన ప్రజాసేవ సమితి గౌరవ అధ్యక్షులు అరబ్ సా, ఉపాధ్యక్షులు సలీం, సహాయ కార్యదర్శి మస్తాన్‌వలి, వీరు, యువత ప్రధాన కార్యదర్శి యూసుఫ్, సహాయ కార్యదర్శి పరహన్, మునయ్య, నరసింహ, సుధాకర్ పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందిస్తున్న ముక్తియార్, సుధాకర్‌రెడ్డి

ముస్లిముల అభివృద్ధి టిడిపితోనే సాధ్యం

ప్రజాశక్తి - ఖాజీపేట

ముస్లింల అభివృద్ధి టిడిపితోనే సాధ్యమని ఆ పార్టీ మైనారిటీ జిల్లా సంయుక్త కార్యదర్శి కమలాపురం గౌస్ తెలిపారు. హైదరాబాదులో మైదుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్‌ను తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. మండలంలో ముస్లిం మైనారిటీలకు రాష్ట్ర, జిల్లాస్థాయిలో కీలక పదవులు దక్కేలా పుట్టా సుధాకర్ యాదవ్ అధిక ప్రాధాన్యత ఇవ్వడం సంతోషదాయకమన్నారు. ఈ సందర్భంగా ముస్లిం మైనారిటీల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా చంద్రబాబును చేయడం కోసం అందరూ కష్టపడి పనిచేయాలని పుట్టా సూచించినట్లు గౌస్ తెలిపారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి టిడిపి బలోపేతానికి పాటుపడతామని తెలిపినట్లు వివరించారు.


పుట్టాను సన్మానిస్తున్న కమలాపురం గౌస్

ఐదుగురు పేకాటరాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి - ముద్దనూరు

మండలంలోని కొర్రపాడు గ్రామ సమీపంలో ఆదివారం కంప చెట్లలో పేకాట ఆడుతున్న ఐదుగురు అరెస్టు చేసినట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. వీరివద్ద నుంచి రూ.3,100 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వైసిపి కార్యాలయ భవనానికి భూమిపూజ

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

పట్టణంలోని వరిగ రోడ్డు సమీపంలో ఏర్పాటు చేయబోయే వైసిపి కార్యాలయ భవన నిర్మాణానికి ఎంఎల్ఎ గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఆదివారం భూమి పూజ చేశారు. సంప్రదాయకంగా వేదపండితలు శ్రీకాంత్‌రెడ్డిచే ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటుచేస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందని చెప్పారు. త్వరలోనే నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఆయన కాంట్రాక్టర్లను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ ఫయాజ్‌బాష, వైస్ ఛైర్మన్ ఫయాజూర్ రెహమాన్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ వండాడీ వెంకటేష్, వైఎస్ఆర్ సిపి మైనారిటీ నాయకులు బేపారీ మహమ్మద్ ఖాన్, మాజీ ఎంపీపీ పోల్ సుబ్బారెడ్డి, కౌన్సిలర్లు, వైఎస్ఆర్‌సిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

రామాపురం: అన్ని దానాలలో అన్నదానం గొప్పదని లయన్స్ క్లబ్ రాయచోటి బ్రాంచ్ అధ్యక్షులు షేక్ మొహమ్మద్ అన్నారు. శిబ్యాల గ్రామం, రెడ్డి వారిపల్లి చెందిన బొడ్రెడ్డి మహిత, సాయి ప్రతాప్ రెడ్డి దంపతుల కుమార్తె నివ్రితి రెడ్డి మొదటి పుట్టిన రోజు సందర్భంగా బండపల్లి పంచాయతీ పరిధిలోని ప్రేమాలయం వృద్ధాశ్రమంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు మాట్లాడుతూ వృథాశ్రయంలో అన్నదానం చేయడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ప్రజలకు ఉపయోగపడే ఎన్నో సేవా కార్యక్రమాలు తమ లయన్స్ క్లబ్ ద్వారా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ పుట్టిన, పెళ్లి రోజు వేడుకలు, ఇతర శుభకార్యాలకు డబ్బులు వృథా చేసుకోకుండా ఇలా ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు చేయాలని పేర్కొన్నారు. దాతలు మాట్లాడుతూ తమ కుమార్తె సావిత్ర రెడ్డి మొదటి పుట్టిన రోజు పురస్కరించుకొని వృద్ధులకు అన్నదానం చేయడం సంతోషంగా ఉందన్నారు.

జంతు కళేబరాల ఆవాసాలు.. బైపాస్ రోడ్లు

- భరించలేని దుర్గంధం.. ఇబ్బందులకు గురవుతున్న ప్రయాణికులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

జంతు మృత కళేబరాల ఆవాసాలుగా ప్రొద్దుటూరు-జమ్మలమడుగు బైపాస్ రోడ్లు మారాయి. గోపవరం, కొత్తపల్లి పంచాయతీ పరిధిలోకి వచ్చే ఈ బైపాస్ రోడ్లల్లో జంతువుల కళేబరాల్లో ముఖ్యంగా పందులు, కుక్కలు, గేదెలు ఉంటున్నాయి. అవి చనిపోయిన వెంటనే ఇక్కడకు తెచ్చి పడేయడం పరిపాటిగా మారిందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. వీటి నుంచి వచ్చే దుర్వాసనను భరిం చలేకున్నామని వాపోతున్నారు. పదుల సంఖ్యలో జంతువుల మృతదేహాలు ఇక్కడ దర్శన మిస్తుం టాయని పేర్కొంటున్నారు. కుక్కలు, గ్రద్దలు కళేబరాలను పీక్కు తింటుంటాయని తెలిపారు. అంతేకాక కాలానుగుణంగా కళేబరాలు కుళ్లిపోయి ముక్కుపుటాలు అదిరిపోయే దుర్గంధాన్ని వెదజల్లుతూన్నాయి. ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులకు గురికావడమేకాక.. ఇలాంటి అపరిశుభ్ర వాతావరణం వలన గాలి కలుషితమై రోగాలు వ్యాప్తి చెందే అవకాశం ఉందని పలువురు వాపోతున్నారు. జంతు మృతదేహాలను ప్రజలుకానీ, పంచాయతీ సిబ్బందికానీ పూడ్చాల్సి ఉంది. ముఖ్యంగా రురల్ పోలీసుస్టేషన్ నుంచి బైపాసుకు వెళ్లే దారిలో జంతు కళేబరాలతోపాటుగా కోళ్ల వ్యర్థాలు ఇక్కడే పడ ేస్తున్నారు. వీటి వల్ల కూడా భరించలేని కంపు వస్తోంది. గాలి కాలుష్యం అవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈదురుగాలులు వీచినప్పుడు కోళ్ల ఈకలు అటు వెళుతున్న వాహనదారులు, పాదచారులపై పడుతూ తీవ్ర అసౌకర్యానికి గురి చేస్తున్నాయి. అటువైపు వెళ్లాలంటే హడలిపోతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



బైపాస్ రోడ్డు వద్ద కుళ్లిన జంతువుల కళేబరాలు

పేదలను ఆదుకోవడమే ధ్యేయం


కరస్పాండెంట్ నారాయణరెడ్డిని సన్మానిస్తున్న రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

ఆపదలో ఉన్న నిరుపేదలను ఆదుకోవడమే ధ్యేయంగా మానవతా సేవా సంస్థ పని చేయాలని పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తులసిరెడ్డి కోరారు. స్థానిక శ్లోకా పాఠశాలలో ఆదివారం మానవతా సేవా సంస్థ కార్యవర్గ సమావేశాన్ని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా నారాయణ పాఠశాల కరస్పాండెంట్ నారాయణరెడ్డి, లక్ష్మణ కృష్ణారెడ్డి ఇచ్చిన బాడీఫ్రీజర్లును తులసిరెడ్డి, జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి, సర్పంచు రాచినేని శ్రీనువాసులు, ఎంపిపి లక్ష్మి గాయత్రీ ప్రారభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో తులసిరెడ్డి మాట్లాడుతూ మంచి కార్యక్రమాలు చేసేందుకు మానవతా సభ్యులు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్న సేవాలతోపాటు ప్రత్యేకించి వేంపల్లె మండల శాఖ చేస్తున్న సేవా కార్యక్రమాలు బహు ప్రశంసనీయమన్నారు. జడ్‌పిటిసి రవికుమార్ రెడ్డి మాట్లాడుతూ మానవతా సేవా సంస్థ పురోభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఎంపీ అవినాష్‌రెడ్డి కూడా మానవతాకు సహకరిస్తున్నట్లు చెప్పారు. శాంత బయోటిక్ కంపెనీ మానవతాకు సహకారం ఇవ్వడం సంతోషకరం అన్నారు. శాశ్వత సభ్యత్వం చేసిన నారాయణ, శ్లోకా పాఠశాలల కరస్పాండెంట్లు నారాయణరెడ్డి, నవనీశ్వరరెడ్డిలను మానవతా సంస్థ తరపున ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మానవతా సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, శాంత బయోటిక్ సహ వ్యవస్థాపకుడు రామకృష్ణారెడ్డి, సీనియర్ ఆడిటర్ శివరామిరెడ్డి, మానవతా చైర్మన్ చక్రపాణిరెడ్డి, వేంపల్లె మండల శాఖ అధ్యక్షుడు కావలి కృష్ణతేజా శ్రీకళ, బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

జగన్ ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

ముఖ్యమంత్రి జగన్ ఆశయాలను అనుగుణంగా ప్రతి వైసిపి కార్యకర్త పార్టీ కోసం పని చేయాలని ఆపార్టీ మండల కన్వీనర్ చంద్రఓబుల్‌రెడ్డి కోరారు. సిఎం జగన్ ప్రజా సంకల్ప యాత్ర ప్రారంభించి అయిదేళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం స్థానికంగా రాయచోటి-పులివెందుల బైపాస్‌లో ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి, ఎంపిపి లక్ష్మి గాయత్రి, సర్పంచు రాచినేని శ్రీనువాసులు, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ షబ్బీర్‌వలి, మాజీ వక్ఫ్ బోర్డు మెంబర్ నిమ్మకాయల దర్బార్, కమతం రాజా, మాజీ సర్పంచు ప్రసాద్ రెడ్డి, అయ్యవారిపల్లె సర్పంచు రామగంగిరెడ్డి, పాస్టర్ రవికుమార్, నాయకులు పాల్గొన్నారు.

చాపాడు : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్షనేతగా చేపట్టిన పాదయాత్ర అయిదేళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం మండల కేంద్రమైన చాపాడులో వైసిపి నాయకులు సంబరాలు చేసుకున్నారు. పార్టీ మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి ఎస్ఆర్ బాలనరసింహారెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ జయరామిరెడ్డి, చియ్యపాడు-2 మాజీ ఎంపిటిసి మహేష్ యాదవ్, వైసిపి యువ నాయకులు ప్రకాష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముద్దనూరు : ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకునేందుకు ప్రతిపక్షనేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్ప పాదయాత్ర చేపట్టి అయిదేళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం వైసిపి మండల కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించగా.. మౌనిక మిల్క్ డెయిరీ ఎండి శ్రీనివాసులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : జగనన్న ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు ఆంధ్ర రాష్ట్ర ప్రజల తలరాతను మార్చుటకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తొలిఅడుగు వేసి అయిదేళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం స్థానిక 5 వార్డు కౌన్సిలర్ తుంగా వెంకట్రామిరెడ్డి తన కార్యాలయంలో వైఎస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో 6వ వార్డు కౌన్సిలర్ నాగిరెడ్డి, గంగిరెడ్డి పాల్గొన్నారు.

'ఇంట గెలిచి.. రచ్చ గెలిస్తే బాగుంటుంది'

- కాంగ్రెస్ ఇన్‌ఛార్జి వేలూరు శ్రీనివాసరెడ్డి

పులివెందుల : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంట గెలిచి.. రచ్చ గెలిస్తే బాగుంటుందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వేలూరు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గుంటూరు జిల్లా ఇప్పటం గ్రామంలో ఇటీవల చోటు చేసుకున్న ఇళ్ల కూల్చివేతపై ఆయన స్పందించారు. ఆదివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. 80 అడుగుల వెడల్పు ఉన్న ఓ చిన్న గ్రామంలో జెసిబిలతో ఇళ్లను కూల్చడం దారుణమన్నారు. అయితే తాము విస్తరణకు వ్యతిరేకం కాదన్నారు. కానీ పులివెందులలో మాత్రం ముఖ్యమంత్రి అధికారం చేపట్టి మూడున్నరేళ్ళు కావస్తుందన్నారు. ఇంతవరకు అంగుళం గోడ కూడా కూల్చలేదంటే అధికారుల పనితీరు ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. అధికారం చేపట్టిన తొలినాళ్లలో రోడ్ల విస్తరణకు సంబంధించి ఆఘమేఘాలమీద కొలతలు కూడా సేకరించారు. ఆ తర్వాత ఏమి జరిగిందో అంతా నిశ్శబ్ధమైందన్నారు. రోడ్ల విస్తరణలో దాగి ఉన్న రహస్యం ఏమిటో ఇంతవరకు ఎవరికీ అర్థం కాలేదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీకాంత్, శంకర్‌రెడ్డి, మహేంద్ర పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

అభివృద్ధి పథంలో కొత్తపల్లె పంచాయతీ

- సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి


మాట్లాడుతున్న సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

కొత్తపల్లె పంచాయతీ అభివృద్ధి పథంలో పయనిస్తోందని సర్పంచు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి పేర్కొన్నారు. వివేకానంద కాలనీ, ప్రకాష్ నగర్‌లో ఆదివారం ఆయన పంచాయతీ పల్లెబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచు వార్డు ప్రజలతో మమేకమై గత పాలకుల హయాంలో చేసిన అభివృద్ధిని, ప్రస్తుతం తమ వైసిపి ప్రభుత్వం చేసిన పురోగతిని ప్రజలకు వివరించారు. గతంలో ఈ ప్రాంత వాసులు నీళ్లకు చాలా ఇబ్బందిపడేవారన్నారు. కొత్తపల్లె పంచాయతీలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో తాము ఎల్లవేళలా కృషి చేస్తూంటామన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి భాగ్యమ్మ, 3వ వార్డ్ మెంబెర్ కొనిరెడ్డి రమణారెడ్డి, 16వ వార్డ్ మెంబర్ బందెల మోష, 19వ వార్డు మెంబెర్ నందిరెడ్డి తిరుపేల్‌రెడ్డి, వైసిపి నాయకులు పొట్టు లక్ష్మిరెడ్డి, సుమంతు, హసీనా, కార్యకర్తలు, కొనిరెడ్డి అభిమానులు పాల్గొన్నారు.

నిధులున్నా.. అందని వేతనాలు

- పది నెలలుగా ఎదురుచూపులు.. ఆందోళనలో పంచాయతీ కార్మికులు

ప్రజాశక్తి - కలసపాడు

మండలంలోని ఆయా పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు పది నెలలుగా వేతనాలు అందడం లేదు. ఇటీవల ప్రతి పంచాయతీకి 14వ ఆర్థిక సంఘం నిధులు మంజూరయ్యాయి. అయినప్పటికీ వేతనాలు ఇవ్వడంలో సర్పంచులు, మండల అధికారులు జాప్యం చేస్తుండడంతో కార్మికులు ఆందోళన చెందుతున్నారు. కలసపాడు పంచాయతీకి ఇటీవల రూ.9 లక్షల నిధులు మంజూరయ్యాయి. అయినా కార్మికులకు వేతనాలు మంజూరు చేయకపోవడంతో నానా అవస్థలు పడుతున్నారు. పారిశుధ్య కార్మికులు ఉదయం ఐదు గంటలకే నిద్రలేచి ఇంటింటికీ వెళ్లిచెత్త సేకరిస్తున్నారు. విధుల్లో భాగంగా చెత్తా చెదారం, దుమ్ము, ధూళితో అనారోగ్యానికి గురవుతున్నారు. చివరకు వారికి మాత్రలు కొనుగోలు చేయలేని స్థితిలో ఉన్నారు. పది నెలలుగా వేతనాలు అందకపోవడంతో పూటగడవడం కష్టంగా ఉందని ఎస్‌డబ్ల్యుపిసి వర్కర్ల నాయకులు వెంకటేష్, జైపాల్ పేర్కొన్నారు. పలుమార్లు సర్పంచులకు, అధికారులకు విన్నవించినా వేతనాలు మంజూరు చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోందని తెలిపారు. రోజూ కార్మికులు ప్రతి ఇంటికీ తిరిగి చెత్తను చేసేకరించి ఘన వ్యర్థాల కేంద్రాలకు తరలిస్తున్నారని పేర్కొన్నారు. గతనెల 19న 14వ ఆర్థిక సంఘం నిధులు మంజూరైతే అదేనెల 22న డ్రా చేసి ఇతర కార్యక్రమాలకు వాడుకున్నారని చెప్పారు. దీనిపై సర్పంచులను ప్రశ్నిస్తే తమకే నిధులు చాలడం లేదని, ఇక వేతనాలకు ఎక్కడి నుంచి ఇవ్వాలని సమాధానం ఇస్తున్నారని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి వారికి పెండింగ్ వేతనాలు అందించాలని కోరుతున్నారు.



విధుల్లో పంచాయతీ కార్మికులు

మూడు నెలలు బిల్లులు అందజేస్తాం..

ఈ విషయంపై మండల అభివృద్ధి విస్తరణ అధికారి గంధం మురారి స్పందిస్తూ నిధులు ఉన్నచోట రెండు, మూడు నెలలకు సంబంధించిన బిల్లులు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కొన్ని పంచాయతీల్లో నిధులు లేకపోవడంతో వారికి సర్పంచుల ద్వారా ఎంతో కొంత ఏర్పాటు చేస్తామని అన్నారు.

జాతీయ రహదారికి మరమ్మతులు

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు-ప్రొద్దుటూరు జాతీయ రహదారికి మరమ్మతులు చేపట్టారు. డివైడర్‌కు ఇరువైపులా పేరుకు పోయిన మట్టిని, పిచ్చి మొక్కలను తొలగిస్తున్నారు. దెబ్బతిన్న రోడ్డును తవ్వి నూతనంగా నిర్మిస్తున్నారు. జాతీయ రహదారి మెయింటనెన్స్‌లో భాగంగా ఏడాది పొడవునా మరమ్మత్తు పనులు చేయడం జరుగుతుందని నేషనల్ హైవే అత్తారింటి అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా చాపాడు సమీపంలోని కుందు బ్రిడ్జిపై పేరుకుపోయిన మట్టిని పూర్తిగా తొలగించారు. చాపాడు గ్రామంలో దెబ్బతిన్న రోడ్డును నూతనంగా నిర్మించారు. దుకాణాల వద్ద పేరుకుపోయిన మట్టిని తొలగించారు.


చాపాడు వద్ద నూతనంగా నిర్మిస్తున్న రోడ్డు

మహబూబ్‌బాషాకు ఘన సన్మానం

ప్రజాశక్తి - ఖాజీపేట

టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన జెండాల మహబూబ్ బాషాను ఆదివారం మండలంలోని టిడిపి నాయకులు ఘనంగా సత్కరించారు. టిడిపి మండలశాఖ కన్వీనర్ తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి ఆధ్వ ర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సం దర్భంగా లక్ష్మిరెడ్డి మాట్లాడుతూ.. ముస్లిం లకు పదవులను కట్ట బెట్టడంలో టిడిపి ముం దుంటుందన్నారు. మైనారిటీ ప్రజలు టిడిపి వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో మైనారిటీలు అందరూ పుట్టా సుధాకర్ యాదవ్ గెలుపు కోసం పాటుపడాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు దాసరి శ్రీనివాసులు, రియాజ్, పిచ్చి నాయుడు, మామిళ్ల కృష్ణారెడ్డి, హరినాథ్‌రెడ్డి, సుబ్బరాయుడు పాల్గొన్నారు.


బాషాను సన్మానిస్తున్న లక్ష్మీరెడ్డి, టిడిపి నాయకులు

ఒక్క ఛాన్స్ అంటూ.. రాష్ట్రాన్ని నాశనం చేశారు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

వైఎస్ జగన్ ఎన్నికల ముందు ఒక్క ఛాన్స్ ఇస్తే రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పి, గద్దెనెక్కిన తర్వాత సర్వనాశనం చేశాడని జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని 17, 18 వార్డుల్లో ఆదివారం బాదుడేబాదుడు కార్య క్రమాన్ని నిర్వహించారు. ముందుగా సుంకులమ్మ దేవాలయాన్ని సందర్శించారు. బాణాసంచా పేల్చి, గజమాలతో పార్టీ నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం యువకులు, మహిళలు, నాయకులతో కలిసి భూపేష్‌రెడ్డి ప్రతి గడపకు వెళ్లి వైసిపి ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. మన రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవాలంటే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టిడిపికి ఓట్లు వేసి వేయించాలన్నారు. 2023 మార్చి నెలలో జరుగు పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎర్రగుంట్ల మండల ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల జయరామిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, మండల బాధ్యులు మోహన్‌రెడ్డి, సంజీవరెడ్డి, పెద్ద షేట్, నేతాజీ బాషా, బయపురెడ్డి, రమేష్‌రెడ్డి, కొండారెడ్డి, లాడ్జి అంకిరెడ్డి, సుంకర నాగేశ్వరావు, అబ్దుల్, సంతోష్‌రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మహిళలతో మాట్లాడుతున్న భూపేష్‌రెడ్డి

ప్రజా వ్యతిరేక పాలనకు చరమగీతం పాడుదాం : ఆర్ఆర్

ప్రజాశక్తి - రాయచోటి

ప్రజా వ్యతిరేకత పాలనకు చరమగీతం పాడుతామని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌ఛార్జి రమేష్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని రాయుడు కాలనీలో టిడిపి నాయకులు బాదుడే బాదుడు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ కుమార్‌రెడ్డి ఇంటింటికీ వెళ్లి వైసిపి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు అవినీతి అక్రమాలు, ధరల పెంపుదల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో దారిద్రరేఖకు దిగువనున్న కుటుంబాల జీవనం చాలా ఇబ్బందిగా ఉందన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా వైసిపి నాయకులు భూ కబ్జాలు, మట్టి, ఇసుక అక్రమంగా తరలిస్తున్నారని పేర్కొన్నారు. సామాన్యులకు ప్రభుత్వంలో రక్షణ లేకుండా పోయిందని వాపోయారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్ బాష, పట్టణ అధ్యక్షులు బోనమాల ఖాదర్ వలి, రూరల్ అధ్యక్షులు మురికినాటి వెంకట సుబ్బారెడ్డి, రాజంపేట పార్లమెంట్ ఎస్‌టి సెల్ ప్రధాన కార్యదర్శి ,బీసీ సెల్ కన్వీనర్ శివప్రసాద్ నాయుడు గుట్టబాబుటి) టిఎన్ఎస్ఎఫ్ సాయి ప్రతాప్ , కొట్టే చలపతి, సోనీరాజ్ ఖలీమ్ , జావిద్ అక్తర్, జాబీర్, రెడ్డయ్య, గన్‌మెన్‌రాజు, రఘు, ఇలియాజ్, గంగాధర్, జామీద్ , బసిరెడ్డి, డేరెంగుల రామక్రిష్ణ , హాజీ. ముబాకర్,జి పవన్ కుమార్ రాజు ,కిరణ్, ఖదీర్ కుమార్ ,మన్సూర్ ,రెహమాన్ పాల్గొన్నారు.

11 మందికి కంటి ఆపరేషన్లు

ప్రజాశక్తి - రాయచోటి

మండల పరిధిలోని చెన్నముక్కపల్లెలో ఉన్న లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో 11 మందికి ఆపరేషన్లు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లాలోని రాయచోటి నియోజకవర్గంతో పాటు రాజంపేట, రైల్వే కోడూరు, కె.వి.పల్లె, యర్రావారి పాలెం, కలకడ, కలికిరి, గుర్రంకొండ, పెద్దమండెం, కదిరి, చక్రాయపేట తదితర ప్రాంతాల నుంచి వచ్చిన 30 మంది కంటి రోగులను పరీక్షించి ర్హులైన 11 మంది కంటి రోగులకు ఆపరేషన్లు చేశారు. గతంలో ఆపరేషన్ చేయించుకున్న 40 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా అద్దాలు,మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కంటి ఆసుపత్రి చైర్మన్ వై.వి స్వరూప గుప్తా, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్‌బాష, కంటి వైద్యులు సురేష్ బాబు, భార్గవి, శశిబిందు ,ఆప్తమాలిక్ అసిస్టెంట్ రాజగోపాల్ రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గంధోత్సవం

ప్రజాశక్తి - జమ్మలమడుగు

స్థానిక మెయిన్ బజార్ వీధిలోని జామియా మసీదులో ఆదివారం సాయంత్రం దస్తగిరిస్వామి పవిత్ర జ్ఞాపికలకు పీఠాధిపతి సయ్యద్ షా సాదిక్ పాషా ఖాద్రి ఆధ్వర్యంలో గురువులు, భక్తులు భక్తిశ్రద్ధలతో గంధోత్సవం నిర్వహించారు. మొదటగా జామియా మసీదు నుంచి గురువుల సయ్యద్ షా నూరుల్లా పాషా ఖాద్రి ఆధ్వర్యంలో దస్తగిరి స్వామి కీర్తనలు ఆలపిస్తూ పీఠాధిపతి ఇంటికి చేరుకున్నారు. అక్కడ పకీర్లు దస్తగిరి స్వామి కీర్తనలు ఆలపిస్తూ ఘనంగా మేళా నిర్వహించారు. అనంతరం పీఠాధిపతి స్వామి వారి గంధాన్ని తలపై ఎత్తుకొని జామియా మసీదుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా పీఠాధిపతి దస్తగిరి స్వామి పవిత్ర జ్ఞాపికలకు ప్రత్యేక ఫాతెహా నిర్వహించి, గంధోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో గురువులు సయ్యద్ షా నూరుల్లా పాషా ఖాద్రి, సయ్యద్ అసద్ పాషా ఖాద్రీ, గౌస్ పాషా ఖాద్రి, యాసిన్ పాషా ఖాద్రి, మోసిన్ పాషా ఖాద్రి, వారి కుటుంబ సభ్యులు, ముస్లింలు, చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


జ్ఞాపికలకు ప్రత్యేక ఫాతేహా నిర్వహిస్తున్న పీఠాధిపతి